క్లుప్తంగా

నేడు పుల్లగుమ్మిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వెల్దుర్తి: మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్ నాయుడు తెలిపారు. మండలస్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

సీపీఐ మండల కమిటీ ఎన్నిక

హొళగుంద: మండల కేంద్రంలో బుధవారం సీపీఐ నూతన కమిటీని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ మండల కార్యదర్శిగా గజ్జెళ్లి కాళప్పాచారి, సహాయ కార్యదర్శులుగా పెద్యాట మారెప్ప, హొళగుంద రంగన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గిడ్డయ్య మాట్లాడుతూ.. పేద, బడుగు బలహీన వర్గాలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యుడు పెద్యాట శ్రీరంగ, మండల కార్యదర్శి సతీష్‌కుమార్, రైతు సంఘం నాయకులు మౌలాసాబ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదానం చేస్తున్న యువకులను అభినందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి

చిప్పగిరి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని నగరడోణ గ్రామంలో స్టార్ ఫ్రెండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి, లింగారెడ్డి, కోటిరెడ్డి, భీమ్ రెడ్డి, స్టార్ ఫ్రెండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, గోపి చారిటబుల్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కంకణధారణ

హొళగుంద: మండల కేంద్రంలో ఈ నెల 31న జరిగే సిద్ధేశ్వర స్వామి రథోత్సవం ఇతర కార్యక్రమాలను పురస్కరించుకుని బుధవారం ఆలయంలో స్వామి విగ్రహాలకు కంకణ ధారణ కార్యక్రమం ఘనంగా జరిగింది. సిద్దప్ప, సిద్దమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు, ఆలయ నిర్వాహకులు అనంతరం స్వామి వారికి కంకణధారణ చేశారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారి విరాట్‌మూర్తికి మహామంగళారతి, అభిషేకాలు, నైవేద్య సమర్పణ జరిగాయి. అలాగే ఇతర ప్రత్యేక పూజలతో పాటు మాంగళ్య.. నిశ్రుతార్థ కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 31న సిద్ధేశ్వరస్వామి రథోత్సవం, ఫిబ్రవరి 1న లంకాదహనం, 2న కంకణ విసర్జన కార్యక్రమంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త రాజ పంపన్నగౌడ విలేకరులకు తెలిపారు.

టీడీపీ హొళగుంద కమిటీ రద్దు

హొళగుంద: తెలుగుదేశం పార్టీ హొళగుంద మండల కమిటీని రద్దు చేసినట్లు బుధవారం ఆ పార్టీ ఆలూరు ఇన్‌చార్జ్ కోట్ల సుజాతమ్మ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం టీడీపీ హొళగుంద మండల కన్వీనర్‌గా వీరన్న గౌడ్ ఉంటున్నాడు. ఆయనతో పాటు ఇతర పదవుల్లో ఉన్న కమిటీని రద్దు చేసి హొళగుంద జాతర ఉత్సవాలు ముగిసిన తర్వాత పది రోజుల్లో కొత్త కమిటీని ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు.

వెల్దుర్తి గురుకులం విద్యార్థిని ప్రతిభ



జాతీయ స్థాయిలో వెండి పతకం సాధించిన విద్యార్థినితో కళాశాల బృందం

వెల్దుర్తి: ఈనెల 21 నుంచి 23 వరకు బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి షూటింగ్‌బాల్ క్రీడాపోటీలో వెల్దుర్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకులం విద్యార్థిని ఆర్‌సీ పవిత్ర విశేష ప్రతిభ చూపి వెండి పతకం సాధించింది. ఈ మేరకు రిపబ్లిక్ డే ఉత్సవాల్లో భాగంగా గురుకులం ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి అభినందన కార్యక్రమం నిర్వహించారు. క్రీడాకారిణితోపాటు తర్ఫీదునిచ్చిన పీడీ, పీఈటీలను అభినందించారు. గురుకులం అధ్యాపక, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

భువనగాయత్రి ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: పట్టణ సమీపంలో హైవే 44 పక్కన వెలసిన భువనగాయత్రి ఆలయ 7వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బాలకృష్ణాచారి ఆధ్వర్యంలో హోమాలు, యాగాలు జరిగాయి. పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల చేతులమీదుగా నూతనంగా నిర్మించిన స్వాగత తోరణం ప్రారంభించారు.



పత్తికొండలో రిపబ్లిక్ డే వేడుకల్లో జెండా ఎగురవేస్తున్న ఆర్డీఓ మోహన్‌దాసు



ఎమ్మిగనూరు కోర్టు ఆవరణలో జెండా వందనం చేస్తున్న జడ్జి గురుఅరవింద్



ఎమ్మిగనూరు జవహర్ నవోదయ పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల విన్యాసాలు



పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జెండా ఎగురవేస్తున్న న్యాయమూర్తి దివ్య

వాడవాడలా గణతంత్ర పండుగ

74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో గురువారం సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. వక్తలు భారత రాజ్యాంగ గొప్పతనం, అది రూపుదిద్దుకున్న విధానాన్ని వివరించారు. స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ రూపకర్తల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. పలుచోట్ల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఎన్‌సీసీ, స్కౌట్ విద్యార్థినులు నిర్వహించిన పరేడ్, గౌరవ వందన కార్యక్రమం విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాలల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. – సాక్షినెట్‌వర్క్



కమ్మరచేడు గ్రామ సచివాలయంపై రెపరెపలాడుతున్న జాతీయ జెండా



ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ పతాకావిష్కరణలో చైర్మన్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి



ఆలూరు జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న జడ్జి తరణి



వెల్దుర్తి అంబేడ్కర్ ఎస్సీ గురుకులం బాలికల విన్యాసాలు



పత్తికొండ పోలీస్‌సర్కిల్ కార్యాలయం ఆవరణలో జెండావందనం చేస్తున్న సీఐ మురళీమోహన్



కంబాలపాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల విన్యాసాలు



బాపురం జెడ్పీ పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న శ్రీనివాసులు, నారాయణస్వామి



ఇబ్రహీంపురం పాఠశాలలో మహనీయుల వేషధారణలో విద్యార్థులు



గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ నసురుద్దీన్, అధికారులు



వెల్దుర్తిలో జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ రాజేశ్వరి



ఆస్పరి సొసైటీ కార్యాలయం వద్ద జెండావందనం చేస్తున్న సిబ్బంది

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు

నందవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ అక్కమాంబదేవి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పూలచింత గ్రామంలో ఐఎస్ఏ, ఎస్వైఏ టీం సభ్యులు గోరంట్ల ఆధ్వర్యంలో జల జీవన్ మిషన్‌పై గ్రామ సభ నిర్వహించారు. అనంతరం నీటి సంరక్షణ, పరిసరాల శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యంగా జల జీవన్ మిషన్ ప్రాజెక్టును ప్రభుత్వం చేపడుతోందన్నారు. 2024 జనవరి చివరి నాటికి ఈ పథకం ద్వారా ప్రతి గ్రామంలో ఇంటింటికీ మంచి నీటి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా నిర్ణయించుకునట్లు తెలిపారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎస్వైఏ టీం సభ్యులు మునీర్ అహ్మద్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



పూలచింతలో జలజీవన్ మిషన్ బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న అధికారులు

బాలకృష్ణ వ్యాఖ్యలపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న అక్కినేని అభిమానులు

ఎమ్మిగనూరుటౌన్: వీరసింహారెడ్డి సినిమా సక్సెస్ మీట్‌లో అక్కినేనిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు బాలకృష్ణపై పట్టణంలోని అక్కినేని అభిమానులు గురువారం ఆందోళనకు దిగారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టి బాలకృష్ణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కినేని అభిమాన సంఘ నాయకులు, అభిమానులు గుడికల్ భాస్కర్, వైస్ ఎంపీపీ పోలయ్య, మోహన్, తదితరులు మాట్లాడుతూ.. సినీ ఇండస్ట్రీలో వివాదాలకు దూరంగా ఉండి ప్రేక్షకుల అభిమానం సంపాదించుకున్న అక్కినేని కుటుంబంపై బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటిదూల బాలయ్య అక్కినేని కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గృహ లబ్ధిదారులకు ఓటీఎస్ వరం

నందవరం: పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, గ్రామ సర్పంచ్ మద్దీశ్వరి అన్నారు. గురువారం మండల పరిధిలోని కనకవీడు గ్రామ సచివాలయంలో గణతంత్ర దినోత్సవం జరుపుకున్నారు. సచివాలయం ఎదుట గ్రామ సర్పంచ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని ఓటీఎస్ లబ్ధిదారులకు రుణ విముక్తి పత్రాలు, ఇంటి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులైన ప్రతి పేద మహిళలకు ఇంటి పట్టాలను పంపిణీ చేశామన్నారు. అలాగే వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకం పేదలకు వరంగా మారిందన్నారు. గృహ నిర్మాణ శాఖ నుంచి రుణం పొంది ఇళ్లు నిర్మించుకున్న వారు ఓటీఎస్ కింద రూ.10 వేలు చెల్లిస్తే రుణ విముక్తి పత్రాలతో పాటు ప్రభుత్వమే ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందని వివరించారు. తద్వారా ఇంటిపై శాశ్వత హక్కులు లభిస్తాయని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ నడిపి షేక్ సాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరాముడు, శివన్న, ఈరన్న, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రుణ విముక్తి పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుల్లు, సర్పంచ్ మద్దీశ్వరి

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మంత్రాలయం రూరల్: మండల కేంద్రం ఎమ్మిగనూరు రహదారిలో జగనన్న కాలనీ సమీపంలో ఎమ్మిగనూరు నుంచి మంత్రాలయం వైపు వస్తున్న లారీ గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో నందవరం గ్రామానికి చెందిన రామకృష్ణ (35) అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరుకు తరలించారు.

ఏపీఎఫ్ఆర్ఎస్ సిస్టం రద్దు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపాలిటీలో కార్మికులకు ప్రవేశపెట్టిన ఏపీఎఫ్ఆర్ఎస్ సిస్టంను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, బాలరాజు, మున్సిపల్ కార్మిక సంఘ నాయకుడు ఎల్లప్ప డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను వారి మొబైల్ ద్వారా రోజుకు నాలుగు సార్లు లొకేషన్ హాజరు వేసుకోమనడం తగదన్నారు. అలాగే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గో ప్రదక్షిణ ఎంతో పుణ్యం

కౌతాళం: గో ప్రదక్షిణతో పుణ్యం లభిస్తుందని రామలింగేశ్వర స్వామి పీఠాధిపతి పాల్తూరు చన్నవీర శివచార్య స్వాములు తెలిపారు. మండలంలోని మేళిగనూరు గ్రామంలో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గోశాల నిర్మాణానికి రౌడూకుంద మఠం పీఠాధిపతి శివయోగి శివచార్యులతో కలిసి గురువారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రామలింగేశ్వర స్వామి ఆలయం అతి పురాతన పుణ్యక్షేత్రమని, పూర్వం రాముడు సీతదేవిని వెతుకుతూ మేళిగనూరులో సూర్యోదయ సమయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. మేళిగనూరు, నదిచాగి గ్రామాల భక్తులు, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి పాల్గొన్నారు.

పీఠాధిపతికి తులాభారం

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులకు విజయవాడకు చెందిన సూర్యనాథ్‌రెడ్డి అనే భక్తుడు పుల్లారెడ్డి స్వీట్స్ వారి మిఠాయిలతో గురువారం తులాభారం నిర్వహించారు. అంతకు ముందు ఆయన గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తులాభారం అనంతరం పీఠాధిపతి ఆయనకు శేషవస్త్రం కప్పి ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు.

సమస్యలపై ప్రశ్నించే వారినే ఎన్నుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: శాసన మండలిలో సమస్యలపై ప్రశ్నించే వారిని ఎన్నుకోవాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, నిరుద్యోగుల సమస్యలపై ప్రశ్నించే తత్వం గల వారిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎన్నుకోవాలని సూచించారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి తిమ్మన్న, ఆయా ఉపాధ్యాయ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి

ఎమ్మిగనూరుటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస గోపాల్‌రెడ్డి గెలుపునకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. గోపాల్‌రెడ్డి గెలుపునకు చేపట్టిన ప్రచారంలో భాగంగా రూపొందించిన పోస్టర్లను గురువారం సాయంత్రం తన నివాసంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు సచివాలయ ఉద్యోగాలను కల్పించారన్నారు. అదేవిధంగా పోలీసు శాఖలో ఉద్యోగాలకై నోటిఫికేషన్లు వచ్చాయని గుర్తు చేశారు. మిగిలిపోయిన సచివాలయ ఉద్యోగాల భర్తీకి సైతం చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత సమస్యలపై గళమెత్తే నాయకుడు, అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతు తెలపాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కుమారస్వామి రెడ్డి, ధర్మకారి నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు మదుసుదన్ రాజు, వీరారెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస గోపాల్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

చిప్పగిరి: 2021–2022 విద్యా సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన చిప్పగిరి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ నగదు ప్రోత్సాహకం అందించారు. గురువారం గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని అత్యధిక మార్కులు సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు మౌనికకు రూ.20 వేలు, రఘుకు రూ.10 వేలు, పురుషోత్తంకు రూ. 5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించారు. హెచ్‌ఎం రఘునాథ్, ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న గుమ్మనూరు నారాయణ

31 నుంచి దస్తగిరయ్య స్వామి ఉరుసు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామ సమీపంలో కొండపై వెలసిన భక్తుల ఆరాధ్య దైవం దస్తగిరయ్య స్వామి ఉరుసును ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. 31న నాగదేవత పూజ, గవిలో పూజ, అభయఅంజనేయ స్వామి, పోతప్ప పూజతోపాటు దర్గాలో పూలసెరా ఉంటుందన్నారు. ఇదే రోజు ఉదయం 10 గంటలకు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా దాతల సహకారంతో రూ.15 వేలు, రూ.12 వేలు, రూ. 8 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందిస్తున్నట్లు వారు తెలిపారు. 1న తెల్లవారుజామున స్వామి గంధం సమర్పణ ఉంటుందన్నారు. 2న స్వామికి షంషేర్ ఫాతేల్ ఉంటుందన్నారు. ఉరుసు సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. అలాగే కబడ్డీ పోటీల్లో పాల్గొనే వారు 78931 31306, 79937 60575 నంబర్లను సంప్రదించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.